రెండోరోజు ఒక నామినేషన్


నామినేషన్ దాఖలు చేస్తున్న దేవరూపుల శ్రీకాంత్

అంబర్‌పేట్: అంబర్‌పేట నుంచి రెండవ రోజు ఒక ఎన్నికల నామినేషన్ దాఖలైంది. శనివారం సీపీఎల్ రోడ్‌లోని ఆర్వో కార్యాలయంలో బాగ్ అంబర్‌పేటకు చెందిన దేవరూపుల శ్రీకాంత్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు.

ముఠా గోపాల్ విజయమే లక్ష్యం


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న నర్సింగ్‌ప్రసాద్

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను రెండవసారి గెలిపించడమే లక్ష్యంగా అంకిత భావంతో పని చేస్తున్నామని బీఆర్ఎస్ పార్టీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్‌ప్రసాద్ అన్నారు. శనివారం ముషీరాబాద్ బీఆర్ఎస్ ఎన్నికల కార్యాలయంలో డివిజన్ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగ్‌ప్రసాద్ మాట్లాడుతూ... ముషీరాబాద్‌లో జఠిలంగా ఉన్న ఆదర్శకాలనీ సమస్య పరిష్కరించడంతో పాటు రామాలయం వీధి డ్రైనేజీ సమస్య ఆధునీక రోడ్లు, చేపల మార్కెట్ అభివృద్ధికి ఎంతో కృషి చేశామన్నారు. గత ఐదేళ్లల్లో ముఠా గోపాల్ చేసిన అభివృద్ధిని ఇంటింటికీ వివరిస్తూ ఆయన గెలుపునకు కృషి చేస్తున్నామన్నారు. ఈ నెల 8న డివిజన్‌లో పెద్ద ఎత్తున కళాబృందాలచే ఇంటింటి ప్రచారం ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆకుల అరుణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు డి.శివముదిరాజ్, టి.సోమన్, డివిజన్ ట్రేడ్ సెల్ అధ్యక్ష, కార్యదర్శులు టెంట్‌హౌజ్ శ్రీనివాస్, బి.ఎం.శ్రీనివాస్, నాయకులు వీరేశ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటేయమని అమ్మానాన్నకు చెబుతావా?


చిన్నారిని పలకరిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రోహిణ్‌రెడ్డి

అంబర్‌పేట్: అంబర్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి రోహిణ్‌రెడ్డి విస్తృతంగా, వినూత్న రీతిలో ప్రచారం చేస్తున్నారు. చిన్నారులను కాకా పడితే తల్లిదండ్రులు ఓట్లు వేస్తారని అనేలా తనదైన శైలిలో ప్రచారం సాగిస్తున్నారు. శనివారం బాగ్ అంబర్‌పేట్‌లో పార్టీ నేతలతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

బీఆర్ఎస్ విజయం ఖాయం


బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి ప్రభాకర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విక్టరీ సాధించడం ఖాయమని రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్, వీఎస్టీ యూనియన్ అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మూడవసారి కేసీఆర్ ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపడతారని అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలో ముషీరాబాద్ నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జీ ఎమ్మెల్సీ ప్రభాకర్‌ను ఘనంగా సత్కరించారు. నేతలు కన్నాయాదవ్, రేశం మల్లేష్, కిట్టు, నేత శ్రీనివాస్, సిరిగిరి కిరణ్, కాల్వా గోపి, సిరిగిరి శ్యామ్, భిక్షపతియాదవ్, వెంకటేశ్వర్‌రావు, గౌరీశంకర్, అజయ్‌ముదిరాజ్, రోహిత్‌కుమార్ పాల్గొన్నారు.

మరో అవకాశమిస్తే మరింత అభివృద్ధి


వీరన్నగుట్టలో ఢమరుకాన్ని మోగిస్తున్న ఎమ్మెల్యే కాలేరు

అంబర్‌పేట: బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గానికి ఒక దఫా ప్రచార పర్వంతో చుట్టేశారు. శనివారం గోల్నాక డివిజన్ వీరన్న గుట్టలో శివాలయంలో శివుని దర్శించుకొని పూజారి అందించిన ఢమరుకంతో ఎన్నికల ప్రచారాన్ని మొదలుపెట్టారు. లాల్‌బాగ్, వీరన్నగుట్ట, గోవింద్‌నగర్ ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. స్థానికంగా నెలకొన్న పెండింగ్ సమస్యలను ఎన్నికల అనంతరం పరిష్కరిస్తానని మరో మారు అవకాశం ఇవ్వాలని కోరారు.

ముషీరాబాద్‌లో తొలి నామినేషన్

కవాడిగూడ: నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైన ముషీరాబాద్‌లో మొదటి రోజు అభ్యర్థిలు ఎవరూ నామినేషన్ వేయలేదు. రెండవ రోజు శనివారం ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థి ముత్యాల రాజేష్ తన నామినేషన్ పత్రాలను ముషీరాబాద్ నియోజకవర్గ ఎన్నికల అధికారి వి.లక్ష్మీనారాయణకు అందజేశారు. అభ్యర్థి వెంట ధర్మసమాజ్ ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి గుడపర్తి సంతోష్‌కుమార్, నాయకులు నర్సింగ్, గోపాల్, భవాని తదితరులు పాల్గొన్నారు. ముషీరాబాద్ ఆర్వో కార్యాలయం వద్ద రెండవ రోజు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ముషీరాబాద్ ఎన్నికల నోడల్ అధికారి, చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి ఆర్వో కార్యాలయాన్ని సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.


నామినేషన్ దాఖలు చేస్తున్న డీఎస్‌పీ అభ్యర్థి ముత్యాల రాజేష్

ఉందిలే మంచి ముహూర్తం..!



నామినేషన్‌ల దాఖలుకు మంచి ముహూర్తాన్ని వెతుకుతున్న అభ్యర్థులు

8, 9, 10 తేదీల్లో నామినేషన్ వేయనున్న కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు

జంగ్ తెలంగాణ 2023

ముషీరాబాద్: ఎన్నికల బరిలో పోటీ చేయాలనుకునే వారి కోసం నవంబర్ 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్‌లు దాఖలు చేసేందుకు భారత ఎన్నికల సంఘం వారం రోజుల పాటు సమయాన్ని కేటాయించింది. అయితే ఈ వారం రోజుల్లో మంచి ముహూర్తం కోసం నామినేషన్‌లు వేసే అభ్యర్థులు వెతుకుతున్నారు. తిథి, నక్షత్రాలు కూడా తమ గెలుపునకు సహకరిస్తాయని భావిస్తూ మంచి ముహూర్తం కోసం పండితుల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికే మూడు రోజులు గడిచినా ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి ఒకే ఒక్క అభ్యర్థి నామినేషన్ దాఖలు చేశారు. ఇక మిగతా ఐదు రోజుల్లో ఏ రోజు మంచిది అనే దానిపై తర్జనభర్జన పడుతూ తమ ప్రచారాన్ని వెసులుబాటును చూసుకుంటున్నారు. 6వ తేదీ అయితే మరి అంత ముందు అవసరం లేదని భావిస్తున్నారు. ఇక 7వ తేదీ మంగళవారం రావడంతో ఆ రోజు నామినేషన్ వేయడానికి ఎవరూ ఆసక్తి చూపడం లేదు. 8, 9, 10 తేదీల్లో మూడు రోజులు మంచి రోజులు ఉండటంతో ప్రధాన పార్టీలు ఆ తేదీలలోనే నామినేషన్‌లు వేయడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. 8వ తేదీన బుధవారం ఏకాదశి కావడంతో ఆ రోజు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అంజన్‌కుమార్ యాదవ్ నామినేషన్ దాఖలు చేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇక 9వ తేదీన గురువారం ద్వాదశి కావడంతో ఆ రోజున మంచి రోజుగా భావించిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ముఠాగోపాల్ నామినేషన్ దాఖలు చేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. 10వ తేదీన శుక్రవారం త్రయోదశి కావడంతో ఆ రోజునగానీ పై రెండు రోజుల్లోగానీ బీజేపీ అభ్యర్థి పూస రాజు నామినేషన్ దాఖలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక మిగతా బీఎస్‌పీ, ఇతర స్వతంత్ర్య అభ్యర్థులు కూడా అదే రోజుల్లో నామినేషన్‌లు దాఖలు చేసుకోవడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. పార్టీ బలాబలాలతో పాటు తిథి నక్షత్ర బలం కూడా కావాలని ఆశిస్తున్నారు.

నేను పక్కా లోకల్..



- జీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేషే నాన్‌లోకల్
- అంబర్‌పేట కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రోహిణ్‌రెడ్డి

కాచిగూడ: నేను పక్కా లోకల్ అని... తనను నాన్ లోకల్ అంటున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ నాన్ లోకల్ అని అంబర్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ రోహిణ్‌రెడ్డి అన్నారు. శనివారం బర్కత్‌పుర లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను పుట్టింది, పెరిగింది. చదువుకుంది బర్కత్‌పుర లోని తన స్వంత ఇంటి నుంచేనని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థే నల్గొండ జిల్లా నుంచి ఇక్కడకు వచ్చారని, తనను నాన్‌లోకల్ అంటూ బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేయడంలో అర్థం లేదన్నారు.

8వ తేదీన నామినేషన్...

ఈ నెల 8వ తేదీన తాను నామినేషన్ వేయనున్నట్లు కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రోహిణ్‌రెడ్డి తెలిపారు. పార్టీ టికెట్ క్రికెట్ గేమ్ లాంటిదని, క్రికెట్ పోటీల్లో 10 టీమ్‌లు పాల్గొన్నంత మాత్రాన గెలిచేది ఒక్క టీమేనని, ఆలాగే పది మంది పార్టీ టికెట్ ఆశించినా ఒక్కరికే దక్కుతుందని అన్నారు. పార్టీలో అందరిని కలుపుకుని పోతానని, పార్టీలోని అందరూ తనకు మద్దతుగా నిలుస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ రెండూ పార్టీలు ఒక్కటేనని, ఆ పార్టీలు కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యాని అన్నారు. ప్రజలందరూ కాంగ్రెస్ వైపు చూస్తున్నారని, అంబర్‌పేటలో తన గెలుపు తథ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

అంబర్‌పేట అభివృద్ధే లక్ష్యం

అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేసి తనను గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తానని, అంబర్‌పేట అభివృద్ధే తన ధ్యేయమని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో ఓ కార్యాలయాన్ని ప్రారంభించి ప్రజలకు అందుబాటులో ఉంటూ అక్కడికక్కడే సమస్యలను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకుంటామన్నారు. అంబర్‌పేటను మొదట క్లీన్‌గా ఉంచేలా చూస్తానని, ప్రజలకు ఆర్యోగ్యాన్ని పెంచేలా గ్రీనరీని పెంచుతామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను సమర్థవంగా అమలు జరిగేలా చూస్తానని ఆయన స్పష్టం చేశారు.

కాంగ్రెస్ పాదయాత్రకు విశేష స్పందన


మహిళతో కూరగాయాల ధరలను తెలుసుకుంటున్న అంజన్‌కుమార్‌యాదవ్

- ముషీరాబాద్ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలో ఎక్కడ చూసినా సమస్యలే దర్శనమిస్తున్నాయని తాను పార్లమెంటు సభ్యుడిగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధే నేటికీ కనిపిస్తుందని ముషీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ తెలిపారు. శనివారం రాంనగర్ డివిజన్‌లోని బాకారం, లక్ష్మి టవర్స్, ఎస్ఆర్‌కే నగర్, రిసాల, హరినగర్ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గడపగడపకూ వెళ్లి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ స్కీమ్‌లను వివరించారు. ఈ సందర్భంగా అంజన్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని తెలిపారు. మహిళలు స్వచ్ఛందంగా ఇంటి ముందుకు వచ్చి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలైన 500 రూపాయలకే సిలిండర్, ప్రతి నెల మహిళకు 2500 రూపాయలు వంటి పథకాలను కొనియాడుతున్నారని తెలిపారు. ముషీరాబాద్‌లో ఈసారి కాంగ్రెస్ పార్టీ తప్పకుండా విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పన యాదవ్, పాశం అనిల్‌కుమార్ యాదవ్, అంజిరెడ్డి, ఉమారాణి, జాన్ కెనడి, గుర్రం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అంజిరెడ్డి నివాసానికి అంజన్...

ముషీరాబాద్ కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశించిన ఐఎన్‌టీయూసీ నాయకుడు నల్లవెల్లి అంజిరెడ్డి నివాసానికి కాంగ్రెస్ అభ్యర్థి ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ వెళ్లి కలిశారు. తనకు పూర్తి మద్దతు ప్రకటించి విజయం కోసం కృషి చేయాలని కోరారు. దానికి స్పందించిన అంజిరెడ్డి తప్పకుండా పని చేస్తానని హామీ ఇచ్చి పాదయాత్రలో పాల్గొన్నారు.

ఆరె కటికలకు రాజకీయంగా అన్యాయం

కాచిగూడ: తెలంగాణ రాష్ట్రంలో 23 లక్షలకు పైగా జనాభా కలిగిన ఆరె కటికలను అన్ని రాజకీయ పార్టీలు రాజకీయంగా ఎదగకుండా అణగదొక్కుతున్నాయని తెలంగాణ ఆరెకటిక (సూర్యవంశి) సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.గోపాల్‌రావు అన్నారు. కాచిగూడలోని ఆరెకటిక భవన్‌లో ఏర్పాటు చేసిన ఆరెకటికల దసరా, దీపావళి సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. ఎంతో అనుభవజ్ఞులైన సీనియర్ నేతలు వివిధ పార్టీల్లో ఉన్నా వారిని ఏమాత్రం గుర్తించకుండా కేవలం ఓటు బ్యాంక్‌గా వాడుకుని వదిలేస్తున్నారని ఆరోపించారు. ఆరెకటికలను గుర్తించిన పార్టీలకే తమ మద్దతు ఉంటుందని ఆయన తెలిపారు. నేతల సుభాష్ చందర్‌జీ, శ్రీనివాస్ రావు, చొకేలే, హెచ్.రమేష్ కుమార్, సూర్యప్రకాష్, రాజు, రాజేందర్ పటేల్, సతీష్, రాంమోహన్, విఠల్ కుమార్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో ముఠా గోపాల్ ప్రచారం

చిక్కడపల్లి: ముషీరాబాద్ నియోజవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్ శనివారం సాయంత్రం ఆర్టీసీ క్రాస్ రోడ్డులో విస్తృతంగా ప్రచారం చేశారు. బిర్యానీ హోటల్స్, టిఫిన్ సెంటర్లలో వినియోగదారులను కలుసుకొని కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. వినూత్న తరహాలో హవానదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. సుదర్శన్ గ్రాండ్ హోటల్ ఎండీలు చామల సోమిరెడ్డి, చామల శశిధర్‌రెడ్డి, సుదర్శన్ గ్రాండ్ హోటల్ ల్యాండ్ యాజమాని బాదం బాలకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు ముఠా నరేష్, ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష


ముఠాగోపాల్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ నేతలు

చిక్కడపల్లి: తెలంగాణ రాష్ట్రానికి సీఎం కేసీఆర్ నాయకత్వం శ్రీరామరక్ష అని రాష్ట్ర ఎఫ్‌డీసీ చైర్మన్, ఎన్ఆర్ఐ బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం అన్నారు. శనివారం గాంధీనగర్ డివిజన్‌లోని ముషీరాబాద్ నియోజవర్గం బీఆర్ఎస్ ఎన్నికల కార్యాలయంలో పార్టీ అభ్యర్థి ముఠాగోపాల్‌కు మద్దతుగా ఎన్ఆర్ఐ బీఆర్ఎస్ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ కూర్మాచలం మాట్లాడుతూ... సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీఆర్ఎస్ అభ్యర్థి గోపాల్ గెలుపుకోసం పాటుపడాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్ఆర్ఐ యూకే(లండన్) శాఖ అధ్యక్షుడు అశోక్‌గౌడ్ దూసరి మాట్లాడుతూ... ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త సైనికుడిలా పనిచేసే ప్రతిపక్ష పార్టీలకు వణుకు పుట్టించాలన్నారు. ఎన్ఆర్ఐ నేత రత్నాకర్ కడుదుల, ముఠా జైసింహ, వల్లాల శ్రీనివాస్‌యాదవ్, మల్లేష్, పప్పు, ప్రవీణ్ పంతులు, సుభాష్, ఆకాష్, రాకేష్‌కుమార్, శ్యామ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పార్కుకు రెండు వైపులో గేట్లు ఉండాలని ఆందోళన

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అడిక్‌మెట్ డివిజన్ పద్మాకాలనీలోని ఉషోదయ పార్కుకు ఇరువైపుల గేట్లు ఉండాలని పద్మ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ టి.రితేష్, వసంత్, శ్రీకాంత్, పవన్, అరుణ్, కుమార్ జీహెచ్ఎంసీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. శనివారం పార్కుకు రెండవ గేటు పెట్టాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. గతంలో ఇదే పార్కుకు మూడు గేట్లు ఉండేవని దాన్ని జీహెచ్ఎంసీ అధికారులు రెండు గేట్లు చేశారని వారు తెలిపారు. ఇటీవల అధికారులు ఆ పార్కులో రూ. 38 లక్షల నిధులతో జిమ్ పరికరాలను అమర్చారు. అయితే పార్కుకు ఒకే గేటు పెట్టడం వల్ల స్థానిక ప్రజలకు ఇబ్బందిగా ఉంటుందని.. ఇక్కడ కోతుల బెడద ఎక్కువగా ఉందని కోతులు దాడి చేస్తే పిల్లలు, వృద్ధులు తప్పించుకోవడానికి అవకాశం లేకుండా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ముషీరాబాద్‌లో బీజేపీ జెండా ఎగురవేస్తాం

బీజేపీ అభ్యర్థి పూస రాజు


ముషీరాబాద్ చేపల మార్కెట్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ అభ్యర్థి పూస రాజు

ముషీరాబాద్: రాబోయే ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజల మద్దతుతో ముషీరాబాద్‌లో బీజేపీ జెండా ఎగురవేస్తామని ముషీరాబాద్ బీజేపీ అభ్యర్థి పూసరాజు అన్నారు. శనివారం ముషీరాబాద్ చేపల మార్కెట్ గంగపుత్ర కాలనీలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ బీజేపీకి ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికుడైన తనకు ఒక్కసారి అవకాశం ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అంకిత భావంతో పని చేస్తానని పేర్కొన్నారు. ప్రజల అండదండలు మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే ఎమ్మెల్యేగా గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నగర అధ్యక్షుడు మద్దూరి శివాజీ, ముషీరాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు బద్రినారాయణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జమాల్‌పురి నందు, నాయకులు రాజ్‌కుమార్, ఆయూష్ శక్తిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ గ్రేటర్ ఉపాధ్యక్షుడు

కాచిగూడ: తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యాక్రమాల పట్ల ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అంబర్‌పేట బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శనివారం జరిగిన సమావేశంలో గోల్నాక డివిజన్ సుందర్‌నగర్ ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు మహ్మద్ ముస్తఫాఅలీ తన అనుచరులతో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ నేతలు అడ్వకేట్ మహ్మద్ అబ్దుల్ కబీర్, సయ్యద్ సలీం, అడ్వకేట్ సయ్యద్ పాల్గొన్నారు.

రాంరెడ్డిని కలిసిన అనిల్‌కుమార్ యాదవ్


ప్రఫుల్‌రాంరెడ్డిని కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న అనిల్‌కుమార్‌యాదవ్

చిక్కడపల్లి: బీజేపీకి రాజీనామా చేసన తెలంగాణసాధన ఉద్యమకారుడు, సంఘసేవకుడు ప్రఫుల్ రాంరెడ్డిని యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ కలిశారు. ఈ సందర్భంగా రాంరెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి అనిల్‌యాదవ్ ఆహ్వానించారు. బీజేపీలో కూడా తెలంగాణ ఉద్యమాకారులకు న్యాయం జరగడంలేదని ఆరోపిస్తూ ఇటీవల ప్రఫుల్‌రాంరెడ్డి బీజేపీకి గుడ్‌బై చెప్పిన విషయం విదితమే. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీలో చేరాలని రాంరెడ్డిని కోరుతూ అనిల్‌కుమార్‌యాదవ్, మేడిసురేష్ తదితర కాంగ్రెస్ నాయకులు శనివారం చిక్కడపల్లిలోని రాంరెడ్డి కార్యాలయానికి చేరుకుని కోరారు. తన తోటి ఉద్యమకారులు, సహచరులు, శ్రేయాభిలాషులు, మిత్రులతో మంతనాలు జరుపుతున్నామని రెండు మూడు రోజుల్లో ఏ విషయం తెలియజేస్తానని రాంరెడ్డి కాంగ్రెస్ నేతలకు తెలియజేశారు.

టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్‌గా అనిత

చిక్కడపల్లి: టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనగర్‌గా జక్కని అనిత నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్ ఆమెకు నియమాకతపత్రాన్ని అందజేశారు. ఆమె గాంధీనగర్‌లో మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీతోనే ప్రజా సంక్షేమం సాధ్యమన్నారు. బీఆర్ఎస్ అవినీతి, కుటుంబ పాలనకు ప్రజలకు చరమగీతం పాడతారన్నారు. జరుగబోయే ఎన్నికల్లో పార్టీ విజయం ఖాయమని ధీమావ్యక్తం చేశారు.

ప్రచారంలో తోపులాట.. వాగ్వాదం

ముషీరాబాద్: ఎన్నికల ప్రపచారంలో భాగంగా అంజన్‌కుమార్‌యాదవ్ ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షులు పులి సందీప్‌గౌడ్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ జుహేరీ హుస్సేన్‌ల మధ్య తోపులాట, వాగ్వాదం జరిగింది. వివరాలిలీ... ప్రచారంలో ముందు వరుసలో వెళ్తున్న సందీప్‌గౌడ్‌ను జుహేరి హుస్సే వెనకాల నుంచి చెయ్యితో తోసివేశాడు. దీంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ తలెత్తింది. దీంతో అంజన్‌కుమార్ యాదవ్ ఇద్దరికి సర్దిచెప్పి సమస్యను పరిష్కరించారు. సందీప్‌గౌడ్ మాట్లాడుతూ... అకారణంగా తనను తోసివేసిన జుహేరి హుస్సేన్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

నిర్భయంగా ఓటు వేయండి

చిక్కడపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని మేంఉన్నామంటూ చిక్కడపల్లి ఏసీపీ ఎ.యాదగిరి ఆధ్వర్యంలో చిక్కడపల్లి, ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి పోలీసులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరులు, ప్రజలు తమ ఓటు హక్కును నిర్భంయంగా వినియోగించుకోవాలని అన్నారు. ర్యాలీలో చిక్కడపల్లి అడిషనల్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి, ముషీరాబార్‌ల ఇన్‌స్పెక్టర్ జహంగీర్‌యాదవ్, ఎస్ఐలు నాగరాజు, అభిలాష్, శశిపాల్, మౌనిక, కోటేశ్వర్‌రావు, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబర్‌పేటలో బీజేపీ జెండా ఎగరడం ఖాయం

కాచిగూడ: అంబర్‌పేట బీజేపీ అభ్యర్థి సి.కృష్ణ యాదవ్ శనివారం పాత నల్లకుంట శ్రీ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అంబర్‌పేట నియోజకవర్గం ప్రజలు మార్పును కోరుకుంటున్నారని అన్నారు. ఎన్నికల్లో గెలిపిస్తే.. అంబర్‌పేట రూపురేఖలు మార్చేస్తామన్నారు. అంబర్‌పేటలో బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమని అన్నారు. అంబర్‌పేట అభివృద్ధికి బీఆర్ఎస్ చేసింది ఏమీ లేదని, అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామని, ఒక్క అవకా శం ఇవ్వాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

గాంధీనగర్‌లో బీఆర్ఎస్‌బీసీ సెల్ ప్రచారం

చిక్కడపల్లి: ముషీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్‌ను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ గాంధీనగర్ డివిజన్ బీసీసెల్ అధ్యక్షుడు గడ్డమీది శ్రీనివాస్ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. శనివారం బాపునగర్, వివేక్‌నగర్, జవహర్‌నగర్ ప్రాంతాల్లో వారు కళా బృందాలతో కలసి విస్తృతంగా పర్యటించి కరపత్రాలు పంపిణీ చేసి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. పార్టీ నాయకులు ముఠా నరేష్, సాయి చాణిక్యరెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ దారుణం



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న అబ్బాస్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆగస్టులో జరిగిన పార్లమెంటు సమావేశాల్లో ఆయిల్ సెక్టార్‌తో పాటు ఏడు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని ఇది సరైంది కాదని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి ఎం.డి.అబ్బాస్ అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బీడీఐయూ, సీఐటీయూల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా అబ్బాస్ మాట్లాడుతూ... ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణోద్యమాన్ని ముమ్మరం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ చర్యలను తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. బీజేపీ ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లనున్న పరిస్థితుల్లో దూకుడు విధానాలను కొనసాగించడం దుర్మార్గమన్నారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్, ఎ.బాబురావు, యాదగిరి, టి.సత్తయ్య, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.